# సృష్టి అంతయు పరమాణువుల సముదాయమే!

అన్ని ఎరిగినవారు అవనియందున లేరు
ఏమియు తెలియక నెవ్వడుండు?
కొంచెమెరిగినవాడు కించిజ్ఞ డగునయా
సర్వ మెరిగినవాడు సాయి ఒకడె.

చినుకులు పడినంత చెఱువులు నిండునా?
ఊపిరి బిగపట్ట ఉదరంబు పెరుగునా?
ఉమ్మి మ్రింగ దాహంబు తీరునా?
బొచ్చు కాల్చినంత బొగ్గులగున?

**విద్యార్థులారా!**

మన నిత్యజీవితము సూర్యోదయముతో ప్రారంభమై సూర్యాస్తమయము తరువాత నిద్రించటముతో ముగియుచున్నది. ప్రకృతిలోని ప్రతిమానవుని నిత్యజీవితముకూడను భూపరిభ్రమణపైననే ఆధారపడి ఉంటున్నది. సూర్యుడు ఎప్పుడూ తూర్పువైపునే ఉదయిస్తాడు. పశ్చిమముననే అస్తమిస్తాడు. సూర్యుడు దిక్చక్రము పైకి వచ్చినప్పుడు ఉదయమనియు, ఆచక్రమునకు క్రిందికి దిగిన తరువాత రాత్రి అనియు మనయొక్క విశ్వాసము. ఈ రెండింటి స్వాభావికమైన పరిస్థితులను గుర్తించి మనము ఉత్తర, దక్షిణ దిక్కులను నిర్ణయించుకుంటున్నాము. వివిధ దేశముల యొక్క శీతోష్ణములుకూడను సూర్యునియొక్క బాటను సమీపించి తనయొక్క స్థితి గతులను అనుభవించి తానున్న స్థానమును గుర్తించుకొని వారు పశ్చిమ, ఉత్తరం అనే దిక్కులను భావిస్తున్నారు. ఇది మానవులయందు సహజముగా నిత్యజీవితములో సత్యమైన విశ్వాసముతో అనుభవించేది.

**ఈనాడు ప్రత్యక్ష సత్యమునకు బదులు, అనుభూతులనే ఆధారముగా తీసుకుంటున్నారు**

sri sathyasaivachanamrutam

మరొక కోణమునుండి మనము విచారించినప్పుడు భూమి ఒక గోళమని భావిస్తున్నాము. ఇది గోళమని విశ్వసించాక దీనికి తూర్పు, పశ్చిమములనిగాని, ఉత్తర, దక్షిణములనిగాని, సూర్యోదయ, సూర్యాస్తమయములనిగాని లేవు. అయితే ఈ రెండింటియొక్క అనుభవములో పరస్పర విరుద్ధమైన ఫలితములు మనము చూస్తున్నాము. వైజ్ఞానిక శాస్త్రజ్ఞుడు దీనికి తూర్పు, పశ్చిమమనేదిగాని, ఉత్తర దక్షిణములనేవిగాని లేవు అనే సత్యాన్ని గుర్తిస్తున్నాడు. అయినప్పటికిని, నిత్యజీవితములోపల మనము సూర్యోదయము, సూర్యాస్తమయము అనే ఫలితములను అనుభవిస్తున్నాము. ఇక్కడ అనుభవమే ప్రధానమైన ప్రమాణముగా ఉన్నది గాని పరిశీలనతో చేరిన పరిశోధనను ప్రామాణికంగా తీసుకోవడం లేదు. పరిశోధనలతో పరిశీలించిన సైంటిస్టుకూడను నిత్యానుభవముతో ముడిపడిన కాలమును, భౌగోళికస్థితిని వర్ణించడానికి good morning, good night, east, west అనే పదములు ఉపయోగిస్తున్నాడు. Morning, evening లేదనే ప్రమాణముతో ఉండిన యీ సైంటిస్టు good morning చెప్పటంలో అంతరార్థం యేమిటి? భూమిగోళము కదా, దీనికి morning ఎక్కడ evening ఎక్కడ? తానున్న స్థానము పురస్కరించుకొని దిక్కులు, రాత్రి, పగలు అనే దానిని అనుభూతిలో తాను పొందుతున్నాడు.

మరొక చిన్న ఉదాహరణము. మానవుడు తాను నిల్చుకున్న బల్ల కొంచెము కదిలేటప్పటికి నిల్చుకున్నవ్యక్తికూడను కదలుతాడు. ఒక బండిలో కూర్చుని ప్రయాణము చేసే వ్యక్తి బండి కదులుతే తాను కూడను కదులుతాడు. ఇవి నిత్యజీవితములో మనము ప్రత్యక్షముగా అనుభవించే నిత్యానుభూతులు. కాని మనము ఉండిన భూమి గంటకు ఎన్నో వేలమైళ్లు వేగముతో తన చుట్టూ తాను తిరుగుతుండాది. అంతేకాదు సూర్యుని చుట్టూ యింకను అనేక వేల మైళ్ల వేగముతో భూమి తిరుగుతున్నది. ఇన్ని వేల మైళ్ల వేగముతో తిరుగుతున్న భూమి యేమీ తిరగనట్టు, కేవలము స్థిరముగా వుండినట్టు మనం ఊహిస్తున్నాము. ఉన్న సత్యము ఒకటి, అనుభూతి మరొకటి. యీనాడు ఉన్న సత్యాన్ని మనము గుర్తించటానికి ప్రయత్నించటంలేదు. అనుభవించిన అనుభూతులనే ఆధారముగా తీసుకొని ఉంటున్నాము. మానవత్వములో ఉండినదానికి అనుభూతి అత్యవసరమే గాని, కేవలము పరిశోధన, పరిశీలనలో అంత సంతృప్తి లభించదు.

sri sathyasai vachanamrutam

## పరమాణువుల సముదాయమే సమస్త శక్తికి మూలాధారము

సృష్టి అంతయూ పరమాణువులయొక్క సముదాయమే! ఈ పరమాణువుల యొక్క సముదాయమే సమస్త శక్తికి మూలాధారము. ఈ శక్తి తరంగములయొక్క పరిణామమే ఈ తరంగములు. ఈ పరమాణువులశక్తి ఒక్కొక్క పదార్థమునందు ఒక్కొక్క రకముగా కనుపిస్తుంటాది. చిన్న ఉదాహరణము. ఒక టంబ్లరులోపల కొంత నీరు పోసుకున్నాము. అందులో ఒక్క చిన్నరాయి వేసినప్పుడు నీరు ఆరాయికి స్థానమిచ్చి అడుగుకు పంపుతున్నాది. ఆ పాత్ర కొంచెము కదలెనా, లేక చిన్న గాలి వీచెనా, ఆజలములో తరంగము లేర్పడుతున్నాయి. ఈ తరంగములుకూడను పరమాణువులయొక్క సముదాయమే! ఐతే, యీ పరమాణువులయొక్క తరంగములకు కొంత శక్తి మాత్రమే ఉంటుంది. జలము ద్రవస్వరూపము ధరించినటువంటిది. దీనినే యింకొక రీతిగా మనము యోచించినప్పుడు సముద్రములో ఉన్నది ద్రవపదార్థమైన జలమే. ఈజలము తీవ్రమైన గాలి వత్తిడికి గురయినప్పుడు అది ఉప్పెనవలె పెద్ద తరంగముగా రూపొందుతుంది. ఈ పెద్ద తరంగము కఠినమైన రాయికంటె అతిబలమైనదిగా ఉంటుంది. పెద్దపెద్ద పడవలను కూడను ఛిన్నాభిన్నము గావిస్తుంది. కఠినమైన పర్వతములనుకూడను ముక్కలు చేయగల శక్తి ఈ తరంగములకు ఉంటుంది. ఇంతశక్తి యీ జలమునకు ఎక్కడనుండి వచ్చినది? ఇదంతయు పరమాణువుల శక్తి తరంగములేయని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

## పదార్థములు ఎన్ని మారినప్పటికిని మూలాధారమైన శక్తి మారదు

సృష్టిలో ప్రతి పదార్థముకూడను పరమాణువులచే యేర్పడినదనియు, వీటికంటె అతి సూక్ష్మమైన ఎలక్ట్రాన్సు, న్యూట్రాన్సు, ప్రోటాన్సు అనే శక్తులు కలవనియు యివి మరింత సూక్ష్మమైన కణములనియు, ఈ కణములయొక్క సమూహమే యీ పదార్థముయొక్క స్వరూపమనియు శాస్త్రజ్ఞులు సిద్ధాంతీకరించారు. అయితే, యీ పరమాణువులకు ఉండిన శక్తి ఎక్కడిది? ఇదే మూలాధారమైన శక్తి. పదార్థములు ఎన్ని మారినప్పటికిని మూలాధారమైన శక్తి మారదు. నిత్యసత్యమై ఉంటుంది. ఇది ఒక వెండి టంబ్లరు. అయితే యీ silver టంబ్లరును మార్చి ఒక కప్పుగా చేయించుకోవచ్చు. తరువాత ఒక ప్లేటు, మరికొంత కాలమైన తరువాత ఒక పెట్టెగాను మనము మార్చుకోవచ్చును. టంబ్లరు కప్పుగా మారింది, కప్పు ప్లేటుగా మారింది,

sri sathyasai vahini vachanamrutam

ప్లేటు ఒక బాక్స్‌గా మారింది, కానీ silver మారలేదు. రూపనామములు మారినవిగాని, ఆధారమైన శక్తి స్వరూపమైన వెండి ఒక్కటిగానే ఉంటున్నది. ఈ జగత్తునందు మనకు గోచరమయ్యే సమస్త పదార్థములుకూడను రూపనామములతో కూడినవి. దీనికి ఆధారమైనది, అస్తి, భాతి, ప్రియములు. అస్తి అనగా ఉన్నది అని. There is అని. ఉన్నది అదే being. ఈ సమస్త దృశ్యములంతా కూడను మేటర్. అయితే ఈ దృశ్యకల్పితమైన మేటర్ అంతాకూడను కేవలము రూపనామములతో ఉంటున్నది. దీనికి సత్యమైన ఉనికి చేరినప్పుడే యిది దివ్యత్వముగా మారిపోతుంది. ఇంకా రెండు విధములైన ఆధారములను తీసుకుందాం.

**జగత్తంతయు పంచభూతములయొక్క స్వరూపమే!**

ఇది ఒక stand, ఇది ఒక chair, ఇది ఒక window, యిది ఒక door. వీటి ఆకారములు మరియు అనుభూతిని దృష్టియందుంచుకొని మనము అనేక పేర్లతో పిలుచుకుంటున్నాము. window అంటున్నాము door అంటున్నాము, stand అని పేరు పెట్టాము, chair అంటున్నాము. కాని, యీ నాల్గింటియందు ఉండిన wood ఒక్కటే! కనుక, జగత్తంతయు పంచభూతముల యొక్క స్వరూపమే! వృక్షములన్నీ కాష్ఠమయము. పర్వతములన్నీ శిలామయము. భూమి అంతయు మృణ్మయము, దేహమంతయు మాంసమయము. అయితే, మన వినియోగమును పురస్కరించుకొని అనేక విధములైన రూపనామములు మనము చేర్చుకుంటున్నాము. అన్నింటికి ఆధారమైన మూలాధార వస్తువు ఒకటున్నది. పదార్థములయొక్క పరిశోధనకు, పదార్థముయొక్క అనుభూతికి భేదముగా కనిపించినప్పటికి, యీరెండింటిని సమన్వయపరిచే తత్త్వము ఒక్క ఆధ్యాత్మికమునకు మాత్రమే ఉన్నది. అట్టి సమన్వయము యీనాడు అత్యవసరము. అయితే యిక్కడ జడము, జీవత్వము అనే రెండు పదార్థములుంటున్నాయి. ఇందులో ఉన్న మూలాధారశక్తి ఒక్కటే అయినప్పటికిని పరమాణువులయొక్క సమూహమైన శక్తి సామర్థ్యములు భిన్నముగా ఉంటున్నాయి. ఈ శక్తి, సామర్థ్యములు పురస్కరించుకొని భిన్నదేహములుగా మనకు కనుపిస్తుంటాయి. రాగి ఉన్నది. లోహము, ఇత్తడి ఉంటున్నవి. గోల్డు ఉంటున్నది. ఇవన్నీ భిన్న భిన్న విలువలు కలిగినా పదార్థములుగా మనము భావిస్తున్నాము. యీ విధంగా వాటి విలువలు వ్యత్యాసముగా

sri sathyasai vahini vachanamrutam

ఉండటానికి కారణము యేమిటి? ఈ వస్తువుల యందుండిన పరమాణువుల శక్తి ఘనముగను, అల్పముగను ఉండుటచేతనే! అంతేకాక, జనులు ఈ వస్తువులనుండి పొందే అనుభూతినికూడను ఆధారము చేసుకొని వాటి విలువను నిర్ణయించడం జరుగుతోంది.

### స్థిరమైనది లేకుండా చరమైనది జగత్తులో ఉండటానికి వీలులేదు

జడము, జగత్సంబంధమైన సహాయము లేక మార్పు చెందదు. చైతన్యమునకు యెట్టి సహాయము అక్కరలేదు. అది స్వేచ్ఛతో ఉంటుండాది. ఏమిటి ఈ స్వేచ్ఛ అనగా 'స్వా' 'యిచ్ఛ' యిదే 'స్వేచ్ఛ'. 'స్వేచ్ఛ' అనగా తన దివ్యమైన స్వభావమే! ఆ యిచ్ఛను అనుసరించి జీవతత్త్వము నడుస్తూ ఉంటుంది. ఒక చిన్న ఉదాహరణము. ఒక రాయి 'చాలా కాలమునుండి నేను నిల్చుకొని ఉంటున్నాను. నేను ఇంక కూర్చోవాలి' అనుకున్నంత మాత్రమున అది కూర్చోలేదు. కారణం రాయి జడమైనది. కానీ జీవతత్త్వముతో ఉన్న మానవుడు కొంతసేపు నిల్చుకొని, యేదో కాలు నొప్పిగా ఉందని కూర్చోవాలనుకుంటే తప్పక కూర్చోవచ్చును. ఈ జీవతత్త్వమునందు ఉండిన స్వాతంత్ర్యము అట్టిది. జడమునకు ఉండిన చైతన్యరహిత స్వభావము అటువంటిది. చైతన్యముయొక్క పరిణామమే జగత్తు కనుక, యీ చైతన్యము యొక్క స్వభావము సరైన రీతిలో అర్థము చేసుకోవటము చాలా కష్టము. ఇది గోడ. నీ దృష్టికి యిది ఎత్తుగాను, లావుగాను, పొడవుగాను కనుపిస్తున్నది. నీ స్పర్శకు కఠినముగా కనిపిస్తుండాది. ఈ గోడకు ఇటువైపు ఉండినవానికి అటువైపు ఉండినవాడు కానరాడు. ఇది కేవలము ఒక జడమైనదిగా నీవు భావిస్తున్నావు. కానీ వైజ్ఞానికమైన కోణములో మనము చూచినప్పుడు యిందులో ఉన్నదికూడా పరమాణువులయొక్క సముదాయమే! ఇదే అతి సూక్ష్మమైన పరమాణువులు electrons, protons, neutrons యొక్క కూడిక. దాని దృష్టిలో నీవు చూచినప్పుడు ఇందులో ఒక పరమాణువునకు మరొక పరమాణువునకు చాలాదూరము ఉంటుండాది. టెలిస్కోపుతో మనము పరిశీలన చేసినప్పుడు ఆకాశములో stars యేవిధముగా కనుపిస్తూ ఉంటాయో ఆ విధముగానే యీగోడ కనుపిస్తుంది. గోడకు పూర్తి రంధ్రములే ఉంటున్నాయి. వైజ్ఞానికముగా చూస్తే యిది కేవలం రంధ్రములతో నిండినటువంటిది. భౌతిక దృష్టితో చూస్తే అతి కఠినమైనదిగా మనకు కనుపిస్తుంది. ఈ పరమాణువునకు, మరొక పరమాణువునకు చేరిక లేదిక్కడ. మధ్యలో

sri sathyasai vachanamrutam

స్థానము చాలా అధికముగా ఉంటుండాది. కనుక, ఉన్నది ఒకటి అనుభవించేది మరొకటి. ఈ విధమైన పరిణామముచేతనే జగత్తంతయుకూడను మనకు గోచరిస్తున్నాది. అయితే, యీ చూస్తున్న ప్రపంచముయొక్క రూపనామములనే మనము ప్రమాణముగా తీసుకుంటున్నాము. ఈ పరమాణువుల తరంగములు యెప్పుడూ మార్పు చెందుతూనే ఉంటాయి. మార్పుచెందే యీ పరమాణువులయొక్క స్థితికి మార్పుచెందని మూలాధార శక్తి ఒకటి ఆధారముగా ఉంటుంది. దీనినే 'దివ్యత్వము' అన్నారు. దీనినే 'చైతన్యము' అన్నారు. దీనినే 'ఉనికి' అన్నారు. దీనినే 'సత్' అన్నారు. కనుక, యీవిధమైన అనేక పేర్లతో కూడిన మూలాధారశక్తి లేకుండా ఏ పదార్థమైనా నిల్చటానికి వీలులేదు. కదిలే కారుకు కదలని రోడ్డు ఆధారముగా ఉంటుండాది. ఈ కారుతోపాటు రోడ్డుకూడా కదలితే ప్రమాదము వస్తుంది. కనుక ఒకటి స్థిరము, రెండవది చరము. స్థిరమైనది లేకుండా చరమైనది యీ జగత్తులో ఉండటానికి వీలులేదు. దైవత్వము నిత్యమై, సత్యమై, శాశ్వతమైన స్థితిలో ఉంటుంటాది. దీనినే మూలాధారశక్తి అన్నారు.

**ప్రకృతి, పరమాత్మల సమ్మిళిత స్వరూపమే దివ్యత్వము**

రూపనామములన్నీ మార్పు చెందుతూనే ఉంటాయి. ఈ రూప నామములలో ఉండిన దివ్యమైన శక్తి, పరమాణువులయొక్క సమ్మిళితమైన శక్తి, పరమాణువుల సారాంశమైన శక్తి యేనాటికి మారదు. నీవు నాకు కొంత వెండి నిచ్చావు. దానితో నేనొక టంబ్లరు చేయించుకున్నాను. వెండి నీది, టంబ్లరు నాది. అయితే మన యిద్దరికి యేమైనా భేదము యేర్పడినప్పుడు నా silver నాకు యిమ్మంటావు. నాకు టంబ్లరు కావాలని నేనంటాను. ఐతే silver నీకిస్తే టంబ్లరు నాకుండదు. నాటంబ్లరు నాకిస్తే నీ silver నీకుండదు. Silver తో కూడినదే యీ టంబ్లరు. నాటంబ్లరు నీకు యిచ్చినప్పుడు టంబ్లరుతోపాటు silver కూడా నీకు వస్తుండాది. నీవే silver నాకు యిచ్చినపుడు silver తో పాటు టంబ్లరు నాకు వస్తున్నాది. టంబ్లరు చరము, సిల్వరు స్థిరము. కనక, యీరెండింటిని విభాగము చేయటానికి సాధ్యము కాదు. కనుకనే ప్రకృతి, పరమాత్మ అనే ఈ రెండింటియొక్క సమ్మిళితమైన స్వరూపమే దివ్యత్వము. ఐతే, అంతా భగవత్ స్వరూపమేయని అన్ని పదార్థములు కూడను మనము సమముగా అనుభవించటానికి వీలులేదు. ఒక్కొక్క పదార్థమందు ఒక్కొక్క పరమాణు

srisathyasaivachanamrutam

తరంగముయొక్క శక్తి అతి సూక్ష్మముగను, అతి ఘనముగను ఉంటుండాది. మన శక్తికి సంబంధించినంతవరకు మాత్రమే ఆపదార్థమును మనము వినియోగించాలి. మనశక్తి చిన్నదిగా ఉంటుండి, తరంగములయొక్క శక్తి అధికముగా ఉండిన దానిని అనుభవించటానికి యేమాత్రము మనశరీరము ఒప్పుకోదు. చీమనుండి బ్రహ్మవరకు భగవత్ తత్త్వమే. త్యాగరాజు చెప్పాడు, 'చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో ప్రేమమీర నిలచియుండెడి బిరుదు వహించిన రామా నన్ను బ్రోవరా' అన్నాడు. భగవంతుడు చీమలోన ఉన్నాడు, బ్రహ్మలోన ఉన్నాడు. కానీ, అదే చీమ వచ్చి మన తొడ కొరికిందంటే తక్షణము దానిని చంపివేస్తాము. అదే బ్రహ్మ వచ్చి మన యెదుట నిలచినప్పుడు సాష్టాంగ నమస్కారము చేస్తాము. పరమాణువుల తరంగములయొక్క శక్తి తీవ్రముగా అత్యంత తేజస్సుతో ఉంటుండాది, శక్తివంతమైనదిగా ఉంటుండాది. కాని, పరమాణువులయొక్క శక్తి స్వల్పముగా ఉంటుండాది. ఈ విధంగా శక్తితరంగములయొక్క స్వరూపములను మనము భిన్నభిన్నముగా చూచినప్పుడు భిన్నభిన్న అనుభూతులే మనకు లభిస్తూ ఉంటాయి.

అయితే అన్నింటికి ఆధారమైన దివ్యత్వమనే మూలాధార శక్తి ఒకటి ఉంటున్నది. దీనినే వేదాంతము.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.**

అని వర్ణించింది. నీయొక్క తత్త్వము అంతా పూర్ణమయము అన్నారు. ఈ పూర్ణత్వములో ఉండిన యథార్థమును మనము కొంతవరకు అర్థము చేసుకోవాలి. పూర్ణత్వమనగా యెట్టి కొదవ లేనట్టిది అని మనము భావిస్తున్నాము. పదార్థముయొక్క స్వరూప స్వభావములను కాదు, మనము పూర్ణత్వముగా భావించవలసినది. అందలి పరమాణు తరంగములయొక్క శక్తి సామర్థ్యములను మనము సమత్వముగా భావించాలి. మార్కెట్టుకు వెళ్ళి ఒక కిలో బెల్లము తెచ్చుకున్నావు. ఈ బెల్లము యింత మూటగా ఉంటున్నాది. నీవు ఒక cuboard లో పెట్టావు దానిని. ఒక దినము కొంచెం త్రుంచి కాఫీలో వేసుకొని త్రాగావు. అయితే అదీ బెల్లమే, యిదీ బెల్లమే! ఈ చిన్నముక్క ఆ కిలో బెల్లమునుండి తీసి కాఫీలో వేసుకుంటే అదికూడా బెల్లమే! ఆ



sri sathyasai vachanamrutam

ముద్దలోనుండి యీ ముద్ద తీసిన తరువాత, మిగిలినదీ బెల్లమే. ఈ రెండుకూడను తీపే! 'పూర్ణస్యపూర్ణమాదాయ.' యీ బెల్లము ఆ బెల్లమునుండి తీస్తే ఆ బెల్లములోకూడా తీపే ఉంది. 'పూర్ణమేవావశిష్యతే.' అంతా తీపే! ఆ తీపే పూర్ణము. ఈ పూర్ణత్వమనే దివ్యత్వమును గుర్తించాలంటే కొంతవరకు ప్రయత్నపూర్వకముగా మనము సాధించాలి.

**విశ్వమంతయు విష్ణుస్వరూపమే**

భగవంతుడు నాకు ఎదురుగా వచ్చి కనుపించాలనుకుంటే యేరీతిగా కనుపిస్తాడు? భగవంతుని చూడాలని ఆశించేవాడు, భగవంతుడనేవాడు ఒక ప్రత్యేక రూపాన్ని ధరించి ప్రత్యేక స్థానములో ఉంటాడు అనేవాడు నేరోమైండ్‌వాడే! సర్వత్రా ఉండిన భగవంతుని, అఖండమైన భగవంతుని చూపించమనటంలో యీ narrow తత్వము అక్కడే మనకు అర్థమవుతుంది. కనుకనే వేదాంతము ఏమి చెప్పింది? "చూస్తున్నదంతా దైవమే అయినప్పుడు యింక దైవాన్ని చూపాలంటున్నావే యెంత పిచ్చివాడవురా నీవు?" చూచేదంతా దైవాన్నే! ఇదంతా దైవస్వరూపమే! సర్వము దైవస్వరూపమే! అన్నింటియందు అస్తి, భాతి, ప్రియం అనేది ఉంది. ఇంక భగవంతుని చూపమంటే యెట్లాచూపగలడు? సృష్టిలో యేపదార్థము చూచినప్పటికిని అందులో మాధవత్వము ఉంటుండాది. మైసూర్‌పాక్, గులాబిజాం, బర్ఫీ, పాలకోవ, మిఠాయి, ఖీరు ఎన్ని చేసినప్పటికిని దీనిలో చక్కెర నాకు చూపమంటే మిఠాయిలో ఉన్నది చక్కెరే, మైసూర్ పాక్‌లో ఉన్నది చక్కెరే! ఈ రూపనామములు మాత్రమే వేరు వేరుగా ఉంటున్నాయి. ఆ చక్కెర ఒక్కటే! నీవు మూఢుడవైపోయి చక్కెర ప్రత్యేకముగా చూడటానికి ఆశిస్తున్నావు. విశ్వమంతయు విష్ణు స్వరూపమే! కనుక, దేనిని చూచినా దైవమును చూచినట్టుగా భావించు. దైవమనే పరమాణువులేని తరంగము యీ జగత్తులో ఉండటానికి వీలులేదు. కనుక ఈ పరమాణువుయొక్క కణములే మానవ స్వరూపములు. ఈ అన్నింటికి మూలాధారమైన తత్త్వమే ఆత్మతత్త్వము. ఆత్మ అనగా ఎక్కడ ఉంటున్నది? ప్రత్యేకముగా ఉండేది కాదు. శరీరములో, మనస్సులో, అంతఃకరణలో, ప్రాణములో సర్వత్ర ఉంటున్నది. కనుకనే దీనిని constant integrated awareness అన్నారు. ఇదే నిజమైన ఆత్మతత్త్వము. అన్నింటిలో ఉంటున్నాది. భిన్నభిన్నమైన ఫలితము నందిస్తూ భిన్నభిన్న రూపములలో మనకు గోచరిస్తున్నాది.

sri sathyasai vachanamrutam

కరెంటు ఉన్నది. ఈ మైక్‌లో చేరి నాశబ్దమును దూరముగా అందిస్తున్నాది. అదే కరెంటు బల్బులో చేరి మనకు ప్రకాశము నందిస్తున్నాది. అదే కరెంటు ఫ్యాన్‌లో చేరి నాకు చల్లని గాలినిస్తున్నాది. అన్నింటికి కరెంటే ఆధారము కదా! అదే విధముగనే సర్వాంగములందు, సర్వరూపములందు చేరి భిన్న భిన్నమైన ఫలితములను మనకు చేకూరుస్తున్నది.

**పురుష ప్రయత్నము (సాధన) లేకుండా పవిత్రతత్త్వమును నేరుగా అందుకోలేము**

దైవత్వమనేది సర్వత్రవ్యాపించి ఉండినప్పటికిని దానియొక్క సత్యస్వరూపమును గుర్తించటానికి కొంతశక్తిని మనము సాధించాలి. దానిని భరించి, సహించి, అనుభవించేటి శక్తి సామర్థ్యములను మనము అందుకోవాలి. అదిలేకుండా దీనిని అనుభవించాలని ఆశించటము వెఱ్ఱితనము. ఆ సమత్వమును గుర్తించటానికి, ఆ దివ్యత్వమును అనుభవించటానికి మనము కొంత ప్రయత్న పూర్వకముగా సాధనలు చేయాలి. అదే 'పురుష ప్రయత్నము' అన్నారు. పురుషప్రయత్నము లేకుండా పవిత్రతత్త్వమును మనము డైరెక్ట్‌గా అందుకోలేము. జలములో ఉన్న చేపను పట్టాలంటే ఒక చిన్న కఱ్ఱను తీసుకొని ఆ కఱ్ఱకు త్రాడు కట్టి మధ్యలో ఒక బెండును కట్టి కొసలో ఒక ములుకును వేసి దానికి కొంచెము మాంసపు ముక్కను తగిలించి ఆ నీటిలో వేసినప్పుడు ఆ మాసంపు ముక్కను తినే నిమిత్తము చేప దాని దగ్గరికి వస్తుంది. దానిని తినటానికి పోయి యీ గాలములోపల చిక్కుకుంటుంది. ఈ గాలములో చిక్కుకున్నప్పుడు అటూ యిటూ కదలుతుంది. ఆ కదలినప్పుడు పైన బెండు లోపలకు వెళుతుంది. అప్పుడు చేపచిక్కిందని వాడు పైకి తీస్తాడు. గట్టుపైన కూర్చొని కూడను జలములో ఉండిన చేపను పైగట్టుకు తీసుకురావాలంటే యీ సాధన ఉండాలి. ప్రాకృతమైన జీవితమును మనము గడుపుతూ పారమార్థికమైన పరమాత్మను పట్టాలనుకుంటే అతనిని పట్టేసాధనమును ప్రయత్న పూర్వకముగా మనము సాధించాలి. దేహమనే కఱ్ఱకు భక్తిపాశమనే దారము కట్టి, జాగ్రత అనే బెండును పెట్టి, ప్రేమ అనే మాంసమును చూపించి, వైరాగ్యమనే ముల్లు పెట్టినప్పుడు దివ్యత్వమనేది మనకు చిక్కుతుంది. పంచభక్ష్య పరమాన్నములు తట్టలోపెట్టి పంచ భక్ష్య పరమాన్నమంటే పొట్టలోకి పోతుందా? ఒక్క మెతుకైనా పోదు. తట్టలోని పదార్థము పొట్టలోకి పోవాలంటే చేతికి, నోటికి పని పెట్టాలి. చేతితో సేవ, నోటితో మంత్రము ఉచ్చరించాలి. ఈ

sri sathyasai vachanamrutam

రెండింటితో కూడిన సాధనచేతనే దివ్యత్వము మనకు ప్రాప్తిస్తుంది. అట్లుకాకుండా, ఎట్టి సాధనలు చేయకుండా భగవంతుడు ఉట్టిపడాలంటే ఎలా ఉట్టిపడతాడు? కాసు ఖర్చుకాకూడదు, కాలు గడప దాటకూడదు, కైవల్యము వళ్లో పడాలి! ఇది సోమరితత్వము. ఇలాంటి సోమరులకు దైవత్వమనేది అతి దూరంగా ఉంటుంది. Laziness is rust and dust. Realization is best and rest. మనము రియలైజ్ చేయటానికి తగిన కృషి చేయాలి.

**దేశము అధోగతికి రావడానికి కారణమైన ఆరు పాపాలు**

నీతి లేని కృషి, కృషి లేని సంపత్తి, characer లేని education, త్యాగములేని సాధన, మానవత్వములేని service, నిత్యానిత్య విషయ పరిశీలన లేని రాజకీయము యీ ఆరే జగత్తుకు మహా ప్రమాదకరమైనవి. కనుకనే యివి six sinsఅన్నారు. ఈ sins వల్లనే జగత్తు చిక్కుల్లో పడిపోతున్నది. ఈ ఆరు పాపములే ప్రపంచమును హింసించేవి. మానవత్వము లేని సైన్సు, అది సైన్సు కాదు. Character లేని education అది education కాదు agitation. త్యాగములేని సాధన సాధనే కాదు. ఆ త్యాగమే అమృతత్వమును అందిస్తుంది. కృషిలేకుండా పంటను మనము అందుకోలేము. సేద్యము చేయకుండా పంట యేరీతిగా మనకు లభిస్తుంది? అదే విధముగనే నీతిలేని వాణిజ్యము, కృషిలేని పంట, character లేని education త్యాగము లేని సాధన, మానవత్వము లేని science, నీతి నియమములు లేని రాజకీయములు యీ ఆరే అరిషడ్వర్గములుగా దేశమును పట్టి పీడిస్తున్నాయి. దేశము ఈనాడు అధోగతికి రావటానికి యీ ఆరు పాపాలే మూలకారణము. ఈ ఆరు పాపాలు లేకుండా ఉంటే అదే దైవత్వముగా రూపొందుతుంది. ఈ పాపములనే ధూళి దివ్యత్వమును కప్పి పుచ్చింది. ఈ చేరిన ధూళిని మనము చెరిపి వేయాలి. అదే ఈనాడు విద్యార్థులు నిర్వర్తించవలసిన ప్రధాన విధి. ఆ విధమైన చర్యలలో మనం పాల్గొనకున్న మన చదువులన్నీ నిరర్థకమవుతాయి. అన్నింటికిని భక్తి అత్యవసరము.

**ఎమ్మేలు బియ్యేలు ఏర్పడ చదివియు**
**పేరుగాంచిన పెద్దవారలైన**
**సంపదలుండియు సద్దానపరులై**

sri sathyasai vachanamrutam

పుడమి కీర్తిని గన్న పుణ్యులైన
ఆయురారోగ్యంబు లనవరతంబుండి
పరిపూర్ణ బలులగు వారలైన
జపములు తపములు సతతంబు చేయుచు
వేదములను నేర్పు విప్రులైన
సాటిరారు భక్తులకు ఏనాటికైన
దైవమును కొల్వనిదె రాదు భక్తి
యింతకన్నను వేరెద్ది ఎఱుకపరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార.

మీరు యేసాధనలు చేసినా, చేయకపోయినా భగవత్ ప్రేమను అమితంగా పెంచుకోండి. నిజముగా భగవంతుడెవరంటే, ప్రేమస్వరూపుడే భగవంతుడు! అందరియందు ఆప్రేమ ఉంటున్నది. ఆప్రేమ నిస్వార్థమైనదానిలో ఉపయోగపెట్టాలి. అప్పుడే దైవత్వము సర్వత్రా వ్యాపించగలదు. ప్రేమలేని మానవుడు లేడు. కనుకనే 'ఈశ్వరస్సర్వభూతానామ్' అన్నారు. ఈశ్వరత్వమనగా ప్రేమతత్త్వమే! ఆ ప్రేమే నిజమైన శక్తి. ఆప్రేమకు ఉన్నశక్తి మరి దేనికీ లేదు. ఆ ప్రేమ లేకపోతే శవము వంటిదే దేహము. శ్వాసలేని జీవితము. కనుకనే living death. ప్రేమయే మన జీవితము.

(తేదీ. 08-07-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)

sri sathyasai vachanamrutam